

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



# సంపాద"కులం"కథ

### 7

నెల్లాళ్ళ క్రితం మళ్ళీ "అమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నాను కానీ, ఆ ఊపిరి సర్జరీ తరవాత ఆక్సిజన్ తాలుకు ఉఛ్వాస నిశ్వాసాల విన్యాసం కాదు. జీవితంలో మరొక దేశవాళీ సంస్థ వారి సభా విశేష సంచిక అనబడే సావనీర్ అనబడే జ్ఞాపికకి ఒక సంపాదకుడిగా తంటాలు పడి టైముకి ముద్రించడం, అది బాగా వచ్చిందని దాని తాలూకు ఖర్చు భరించే నాయకులు మెచ్చుకోడం అంతవరకూ ఊపిరి బిగబట్టిన నేను ఘాటిగా "అమ్మయ్య" అని అనుకోడం జరిగిన విశేషం.

ఇదివరలో నేను తయారు చేసిన సావనీర్లూ, పత్రికలూ చాలా మటుకు మా ఊళ్ళోనే ముద్రించబడినా, ఈ సావనీర్ విషయానికి వస్తే, నేను ఉండేది టెక్ససూ, అది ముద్రించబడింది న్యూజెర్సీ కాబట్టి, కంప్యూటర్ మీద అంగరంగ వైభవంగా కనబడినా అసలు ప్రింటయ్యాక ఎలా ఉంటుందో అని కొన్ని కాపీలు పోస్ట్‌లో వచ్చేదాకా హిచ్ కాక్ సినిమా మొదటి సారి చూస్తున్నప్పుడు వచ్చే చచ్చేంత సస్పెన్స్ ఫీలింగుతో వారం రోజులు గడిపాను. అంతియునే కాక ఆ రెండు వందల కేజీలు బరువూ, మూడు పేజీలూ.. సారీ.. మూడు కేజీల బరువూ, రెండువందల పేజీల సావనీర్ చూడగానే తెలుగు సినిమా హీరోయిన్‌ని నిజజీవితంలో చూసిన దానికి రివర్స్ ఫీలింగు వచ్చేసింది. అంటే, మీకు తెలుసుగా, సినిమా హీరోయిన్ తెరమీద భారీగా ఉంటే, ఎదురుగా తానా/ ఆటా/ నాట్స్/ నాటా/ సభల్లో ప్రత్యక్షంగా చూసి తరించేటప్పుడు పీలగానూ, తెరమీద తెల్లగా, దేవతలా ఉంటే, ఎదురుగా కనపడినప్పుడు నల్ల భూతము వలెనూ, తెరమీద నాకంటే పొట్టిగా కనపడి నేను కడు సంతసించే కథానాయిక ఎదురుగా నా కంటే మరీ ఎత్తుగా కనిపించి నాకు ఆశాభంగము కలిగించుటా జరుగును కదా! అదే విధంగా కంప్యూటర్ తెర మీద కనపడిన సావనీర్ సంచికకీ, పోస్ట్ డబ్బాలో వచ్చిన పుస్తకానికీ పోలికలు తక్కువే! ఈ విషయం కంప్యూటర్ డేటింగ్ చేసే యువతీ యువకులు గుర్తుపెట్టుకోమని నా ఉచిత సలహా.

ఈ సావనీర్ కాపీలు నా చేతికంది, ఆ బరువుకి నా చేతులు కందిపోయినప్పుడు ఆకాశవాణి పాతాళలోకం నుంచి మాట్లాడుతున్న గొంతుకతో మా వంటింటి మహారాణి పలకరించింది.

"అయితే ఏమిటంటావ్? ఊళ్ళో వాళ్ళ డబ్బుతో మళ్ళీ మరొక సావనీర్ వేసి తెలుగు సాహిత్యాన్ని ఉద్దరించాను అంటావ్? అంతేనా?" అంది క్వీన్ విక్టోరియా.

"అవును మరి, దీంతో అమెరికాలో ఉన్న మూడు దేశవాళీ సంస్థలకీ అనగా, తానా, ఆటా మరియు ఇప్పుడు నాట్స్ వారి సావనీర్లకి సంపాదకీయం వహించే అదృష్టం మరి నాకే కదా దక్కింది, వచ్చే ఏడు మరి నాటా వారి సావనీర్‌కి కూడా.." అని నేను అంటూండగా..

"ఆ మాట రైటే. నీకు నయాపైసా కూడా దక్కలేదు. దక్కింది యధాప్రకారం చాకిరీయే!

"లేదులే, ఈ సారి ఎక్కువ చాకిరీ మిగిలిన ఇద్దరిదీనీ, పేరు, ప్రఖ్యాతులు మటుకు నాకు కూడా వస్తాయి." అన్నాను.

"నీ తలకాయ. నువ్వు వేసిన సావనీర్లని అధికారులందరూ ఒకసారి తిరగేసి, వాళ్ళ ఫోటో ఎక్కడైనా పడినదా లేదా. ఒక వేళ పడినచో అది అందముగా పడెనా లేక వారి బండారం బయట పడెనా అని నిర్ధారించుకున్న తరువాతే ఆ పుస్తకం బావుందో లేదో చెపుతారు. బొమ్మ బాలేకపోతే అంతే సంగతులు. పేరూ లేదు, ప్రఖ్యాతీ లేదు. చెప్పు దెబ్బలు తినకుండా ఉంటే చాలు".. క్వీన్ విక్టోరియా టెంకి జెల్ల కొట్టుట, విసవిస విరమించుట, నేను నోరు మూయుట త్వరగానే జరిగిపోయాయి.

ఇక్కడ చిదంబర రహస్యం ఏమిటంటే, మా ఇంట్లో నేనూ, క్వీన్ విక్టోరియా మాట్లాడుకోడానికి రోజుకి మూడు నిముషాలు మాత్రమే సమయం కేటాయించాలి అని పెళ్ళినాడే ప్రమాణాలు చేసేసుకుని, ఇన్నేళ్ళగా మా పవిత్ర బంధాన్ని కాపాడుకుంటూ వస్తున్నాం. అంతకు మించి ఓవర్ టైమ్‌లోకి వెళ్ళి, ఓవర్‌గా నేను మాట్లాడితే నా జీవితం ఖచ్చితంగా "భశుం" అయిపోవును ఈ పాటికి. అస్తమానూ ఒకళ్ళతో ఒకళ్ళు ఒళ్ళు మరిచి మాట్లాడుకుంటేనే కదా ఎవరో ఒకరికి ఒళ్ళు మండేదీనూ? సైలెంట్ ట్రీట్మెంట్ ఎప్పుడూ మంచిది అని కూడా యువతీ యువకులకి నా ఉచిత సలహా.

అసలు శ్రీ కృష్ణ పరమాత్ముడు తాను కేవలం నాలుగు కులాలు సృష్టించాను అని పబ్లిగ్గా.. అంటే అటు పాండవులు, కౌరవులు అందరూ వింటూండగా అర్జునుడి దగ్గర ఒప్పుకున్నాడు కానీ, తను రహస్యంగా "సం.కులం" సృష్టించి సాహిత్య లోకం మీదకి వదిలేసి చోద్యం చూస్తున్న సంగతి గురించి ఎక్కడా ఒప్పుకోలేదు. ఎందుకంటే, ఈ "సం.కులం" వారందరూ.. అనగా. ఈ సంపాద"కులం" వారందరూ కౌరవ, పాండవుల్లా దగ్గర చుట్టాలు కాకపోయినా, సాహిత్య చుట్టాలు.. సారీ దుష్టసమాసం.. సాహిత్య బంధువులే కానీ, ఒకరంటే ఒకరికి పడిచావదు అని నా అనుమానం. టూకీగా చెప్పాలంటే, ఈ "సం.కులం"లో పుట్టిన వారికి మిత్రబలం కంటే శత్రు బలం ఎక్కువ. పైగా ముందు మిత్రువైన వాడు అర్జంటుగా శత్రువులతో చేతులు కలిపే అవకాశం చాలా ఉంది.

ఉదాహరణకి, మనం ఒక కథ రాసి ఒక సంపాదకుడికి పంపించాం అనుకోండి. ఏ కళనున్నాడో కానీ, ఆయనకి ఆ కథ నచ్చో, మిగిలినవి అంతకంటే చచ్చుగా ఉండో, మన కథని ప్రచురించాడనుకోండి. అంతే! ఆ సంపాదకుడి టేస్ట్‌ని పొగిడి అవతల పారేసి, మనం ఆయనకి ఆప్తమిత్రుడిగా మారిపోయి, ఆ పత్రిక చాలా ఉన్నతమైన సాహిత్యపు విలువలని పోషిస్తోందని వేనోళ్ళ ఘోషిస్తాం. ఇక పుంజుకుని, పుంఖానుపుంఖాలుగా కథలు రాసి ఆయనకి గుప్పించేస్తే, పాపం ఆ మానవుడు అన్నీ చదవలేక, చదివినా వేసుకోలేక, ఒకటైనా తిరస్కరిస్తాడు కదా. అంతే, ఆ దెబ్బకి మనం అహం దెబ్బతిని, ఆయనకి శత్రువుగా మారిపోయి, ఆ పత్రిక సాహిత్యం విలువలు ఎలా దిగజారిపోయాయో మరొక సంపాదకుడి దగ్గర మొరపెట్టుకుంటాం. ఈ రెండో ఆయన జాతి లక్షణం కాబట్టి మొదటి సంపాదకుడంటే అసలు పడదు కాబట్టి, మనల్ని ఎగసం తొయ్యడానికి మన కథ ఒకటి వేసేసి మెచ్చుకుంటాడు. కొన్నాళ్ళయ్యాక, మూడో సంపాదకుడు రంగంలోకి దిగుట, ఇదే ఆట మళ్ళీ ఆడుకోవుటం జరుగుతుంది. ఇదే, రచయితలకీ, సంపాదకులకీ ఉన్న అవినాభావ సంబంధం.

ఇక సంపాదకుడికి జాతి వైరం అని ఎందుకన్నానంటే, నేను ఒకానొకసారి ఏదో ఊళ్ళో ఏదో సాహిత్య సమావేశానికి వెళ్ళినప్పుడు పత్రికకి ఎడిటర్‌గా చెలామణీ అవుతున్న ఒక పెద్దాయనతో పిచ్చాపాటీ కబుర్లలో పత్రికల టాపిక్ వచ్చింది. ఆయన వెనువెంటనే, "ఫలానా పత్రిక నా మొహంలా ఉంటుంది" అని అభిప్రాయం వెలిబుచ్చాడు. వెంటనే ఆయన మొహం చూసి "అబ్బే, ఆ

పత్రిక బానే ఉంటుందే" అన్నాను. ఆయన అది విననట్టు నటించి, మరొక పత్రిక గురించి మాట్లాడుతూ "అది మీ మొహంలా ఉంటుంది" అన్నాడు. నేను వెంటనే "అవును సుమా" అని ఒప్పేసుకున్నాను. ఎందుకంటే ఆ పత్రిక ముఖపత్రం ఎప్పుడూ అందంగా ఉంటుంది కాబట్టి.

ఇలాటి కేసే కానీ, వీళ్ళ పద్ధతి వేరే రకంగా ఉంటుంది. వాళ్ళ దృష్టిలో వాళ్ళంతటి గొప్ప సంపాదకులు ప్రపంచంలో ఎక్కడా లేరు. "సంపాదకుడంటే, ముందే చుక్కలూ, బొట్లూ పెట్టి, రంగు రంగు బొమ్మలతో ప్రచురించడం కాదు. నేను ప్రతీ ఆర్టికల్‌నీ మా బావమరిది తోటీ, నా బెస్ట్ ఫ్రెండ్స్ ఇద్దరి తోటీ చదివించి, ఆ తరువాతే చుక్కలూ, బొట్లూ పెడతాను. సాహిత్యంలో బొమ్మలెందుకూ, అక్షరాలు ఉంటే చాలదూ?" అని ఆ కేటగిరీ ఎడిటర్ గారొకరు నాతో నొక్కి వక్కాణించారు. సాహిత్యానికి బొమ్మలు అవసరం లేకపోతే, పాపం "బాపు బొమ్మ" ఏమయిపోయేదో!

ఇక మరొక కేటగిరీ సంపాదకులు తమ పత్రికని "గేటెడ్ కమ్యూనిటీ"లా నడుపుతారు. అంటే, తాళం ఉన్న వారికే అందులో ప్రవేశం. అనగా, వారికి నచ్చిన, వారిని నిత్యం మెచ్చుకునే మిత్రబృందం వారి రచనలే ఆ పత్రికలో వేస్తారు. మరీ బావుండదేమో అని, అపుడప్పుడు కలం పేరుతో తమ రచనలే వేసుకుంటారు. పైగా "మా ఉన్నత స్థాయికి అందుకోలేమేమో అని భయపడి, చాలామంది రచయితలు మాకు రచనలు పంపించరోచ్" అని గొప్పలు చెప్పుకుంటారు. అందుకే అన్నారు "ఎవరు వెర్రి వారికి ఆనందం" అని.

ఇక పత్రికలకి సంపాదకీయం వహించడం ఒక ఎత్తయితే, సావనీర్ సంచికలు రూపొందించడంలో పడే కష్టాలంటే, "ఇహ కష్టాలంటారా? బహు సంతాన ప్రాప్తి అనే చెప్పుకోవాలి" అనే మాయాబజార్‌లో అల్లురామలింగయ్య మరియు వంగర డైలాగు గుర్తుకొస్తుంది. ఏదైనా సావనీర్ సంచిక తయారు చెయ్యడానికి అప్పుడప్పుడు తొమ్మిది నెలలబాటు శ్రమించి, ఆఖరి రోజుల్లో ప్రసవ వేదన పడితీరాలి. ఇలాటి సావనీర్ సంచిక నిర్మాణంలో పాత్రధారులు అనేక మందే కానీ, తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు మటుకు నలుగురైదుగురు ఉంటారు. వాళ్ళందరినీ కలిపి సం.బృం అంటారు. అనగా సంపాదక బృందం, లేదా సావనీర్ కమిటీ అనమాట వాళ్ళలో ఒకరు మేస్త్రీ అనగా ఆ సంస్థ తాలూకు నాయక వర్గానికి చెందిన ఒకాయన చైర్మన్ పాత్ర వహించి కేవలం అజమాయిషీ మటుకు చేస్తారు. ఒకరో, ఇద్దరో కావలసిన కథలూ, కవితలూ సంపాదించే పనిలో ఉంటారు. మిగిలిన వారు ఉత్సవ విగ్రహాలే!

మొట్టమొదటగా బడ్జెట్ ఎంతా అనే అధికారుల ప్రశ్నతో మొదలయ్యి, అయ్యబాబోయ్, ఇంత ఎలా అయిందీ అనే ఆఖరి ప్రశ్నార్ధకంతో అంతం అవుతుంది సావనీర్ పని. ఇక రెండోది ప్రతీ ప్రత్యేక సంచికా "చారిత్రాత్మకమైన, కలకాలం గుర్తుంచుకో దగ్గ, ఇంట్లో టీపాయ్ మీద ప్రదర్శించే ఉత్తమ సాహిత్యం, పంచరంగుల చిత్రాలతో వెలసిల్లే ఖండ కావ్యం" అని అన్నిచోట్లా టముకు కొట్టాలి. అంతకు తక్కువగా పబ్లిసిటీ ఇస్తే అధికారులు ఒప్పుకోరు. సంపాదకులకి కూడా అది నిజమే సుమా అనే భ్రమలో ఉండి, అభ్యంతరం చెప్పరు. ఇక్కడ "పంచ రంగుల చిత్రాలూ అంటే, కేవలం ఆ సంస్థ అధికారులూ, మరియు మహాదాతలూ వేసుకున్న రంగు రంగుల కండువాలూ, వారి భార్యల రంగు రంగుల పట్టు చీరలూ, రంగు రంగుల అమెరికా అల్లుడి జుబ్బాలూ, వియత్నాం కోడలి రంగు రంగుల పంజాబీ డ్రెస్సులనే మనం అర్ధం చేసుకోవాలి." ఈ దానాల రేట్లకీ, ఫోటో సైజుకీ ఒక "రహస్య ముడి" ఉంటుంది.

మనం సంపాదకులం అని నాయకులు ఖచ్చితంగా చెప్పగానే ఇక సంపాదించడం మొదలు పెట్టాలి కాబట్టి "చారిత్రాత్మకమైన, కలకాలం గుర్తుంచుకో దగ్గ, ఇంట్లో టీపాయ్ మీద ప్రదర్శించే ఉత్తమ సాహిత్యం, పంచరంగుల చిత్రాలతో విలసిల్లే ఖండ కావ్యం సంచిక"లో ప్రచురణకు పరిశీలనార్ధం మీ రచనలకు ఆహ్వానం" అని ప్రకటించిన మర్నాడే ఏమైనా కథలూ, కవిత్వాలూ మీకు అర్జంటుగా ఈ మెయిల్ లో వచ్చాయనుకోండి. అంటే, ఆ రచనల ఆ రచయిత ఎన్నో చోట్లకి ఇది వరకే పంపించాడనీ, ఏ సంపాదకుడూ వాటిని ప్రచురించడానికి ఒప్పుకోలేదు కాబట్టి ఆఖరి ప్రయత్నంగా మనకి పంపించాడని మనం అర్ధం చేసుకోవచ్చును. ఆ నలభై గిగాబైట్ల, అరవై పేజీల చేతివ్రాత కథ డౌన్ లోడ్ చెయ్యడానికి మన కంప్యూటర్ దగ్గులూ, కక్కులూలాటి విపరీత చేష్టలు చేస్తూ ఉండగా, దాని అవస్థ

చూసి మనం నిస్సహాయంగా శ్రీ వేంకటేశ్వర స్వామి సహాయాన్ని అర్థిస్తున్నప్పుడే మన ఫోన్ మోగి "ఏం సార్, నా కథ వచ్చిందా, నచ్చిందా, మళ్ళీ పంపించనా, మరొకటి కూడా పంపించనా?" అనే ఫోన్ కాల్ వచ్చిందనుకోండి మన అనుమానానికి మరొక ఆధారం దొరికినట్టే. ఒకసారి ఒళ్ళుమండి "మళ్ళీ మీ కథ పంపించారంటే చంపేస్తాను. ఇంకో కంప్యూటర్ కొనుక్కుంటే మా క్వీన్ విక్టోరియా నన్ను చంపును" అని ఆవేశంలో ఒకాయనకి చెప్పగానే, ఆయన వెంటనే నా శత్రువర్గంలో చేరిపోయి, ఆయన బావమరిది అయిన మా సం.బృం చైర్మన్ గారికి ఫిర్యాదు చేశాడు. చచ్చినట్టు ఆ కథ వేసుకోవలసి వచ్చింది. అందువలన చెత్త సంకలనంలో పరమ చెత్తగా ఆ సావనీర్ "కలెక్టర్స్ ఐటెమ్"గా మారిపోయింది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, మెయిల్ బాక్స్‌లో చూడగానే ఈ సరికొత్త సావనీర్ పేజీలు గబ, గబా తిప్పాను అధికారులూ, దాతలూ మొదలైన ప్రముఖుల రంగు రంగుల ఫోటోలు సర్వాంగ సుందరంగా పడ్డాయా లేదా అని వెరిఫై చెయ్యడానికి. అప్పుడు నాకు శ్రీ శ్రీ గారి జోకు ఒకటి గుర్తుకొచ్చింది. అదేమిటంటే, అప్పటికింకా మహాకవిగా కాకపోయినా మంచి కవిగా పేరు తెచ్చుకున్న శ్రీశ్రీ గారి మిత్రుడొకాయన మద్రాసులో ఒక ఫొటోగ్రఫీ కొట్టు పెట్టారట. ఆ మిత్రుడు శ్రీశ్రీగారిని పిలిచి "నువ్వు కవిత్వం రాస్తావు కదా. నా కొత్త కొట్టుకి కష్టమర్లని ఆకట్టుకోవడానికి ఏమైనా మాంచి కాప్షన్ రాసియ్" అని అడిగారు. దానికి శ్రీశ్రీ గారు "ఇచ్చట మీ ఫోటోలు అందముగా తీయబడును" అని రాసిచ్చారు. దానికి ఆ మిత్రుడికి కొంచెం కోపం వచ్చి "నువ్వేదో పెద్ద పండితుడివి అనుకుంటే, ఈ కేప్షన్ ఇంత చప్పగా ఉందేమిటీ? అది చదవగానే కష్టమర్లు క్యూ కట్టాలని చెప్పాను కదా" అన్నాడు. అప్పుడు శ్రీ శ్రీ మరొకటి క్లుప్తంగా రాసి ఇచ్చారు. "ఇచ్చట మీ ఫోటోలు అచ్చు మీ మొహం వలే తీయబడును"

అన్ని సంఘాల నేతలకీ ఇందు మూలముగా నేను విన్నవించుకునేది ఏమిటంటే సావనీర్లలో తమ ఫోటోలు కూడా అచ్చు తమరి మొహం వలెనో, తమరి భార్యల, పిల్లల మొహాల వలెనో ఉండును కానీ, అక్కినేని, అమితాబ్, జయప్రద, ఎన్టీఆర్ జూ, ఇలియానాల వలె ఉండబోవు. ఏదో సద్దుకుపోవాలి. దానికీ సావనీర్‌కి ఇస్తానన్న డొనేషన్‌కీ లంకె పెట్టకూడదు. లేకపోతే కష్టపడి పని చేసి తెలుగు టైపింగ్ కొట్టిన అమ్మాయి, ప్రతీ ఆర్టికల్‌కీ బొమ్మలు గీసిన ఆర్టిస్ట్‌కీ, అందంగా ముద్రించిన ప్రెస్సు వారూ నా కొంప ముంచుదురు కదా! వారి ధర్మమా అని.. సారీ ధర్మం చెయ్యని కారణం చేత.. ఆ బిల్లు నాకు పడిన యడల మా విక్టోరియా మహారాణి నాకు గుండు గీయించి, అసలు సిసలు గార్ధభాన్ని అమెరికా తెప్పించును కదా!

●●●

Click here to share your comments on this article